# సాంఘీక దృక్పథంలో రెవ. పురుషోత్తమ చౌధరి

తెలుగు క్రైస్తవ లోకం మరచిపోలేని, మరచిపోకూడని క్రైస్తవ సాహిత్య వీరులలో ఒకరు మరియు అగ్రగణ్యుడు రెవరెండ్ పురుషోత్తమ చౌధరి. వీరి 200 వ జయంత్యుత్సవాలలో భాగంగా జరుపుకుంటున్న నేటి ఈ సంభరంలో వారిని గూర్చి ఈ వ్యాసము మీ ముందుంచడం నా జీవితంలో ఒక గొప్ప స్మరణీయ సంఘటనగా భావిస్తున్నాను. నాకీ మహదవకాశాన్ని యిచ్చిన క్రైస్తవ కవి సార్వభౌమ ఆచార్య రావెల వారికి నా హృదయపూర్వక వందనములు.

ఈ వ్యాసములో రెవరెండ్ పురుషోత్తమ చౌధరి గారి జీవితాన్ని మరియు రచనలను సాంఘీక దృక్పథములో మీ ముందుచడానికి చేస్తున్నదే నా యీ ప్రయత్నము.

<u>జీవిత విశేషాలు</u> :

జగమెరిగినట్లుగా వీరి పేరులోని చౌధరి కుల సూచక పదము కాదు కానీ యిది వారి ఇంటి పేరు. పరలాకిమిడి జమిందారు వద్ద ఆస్థాన కవిగాను, అనేక గ్రామాలకు కరణముగాను పనిచేసిన బుద్ధిరాజుగారి కుమారుడైన కురమున ( కూర్మనాథ) పట్నాయిక్ చౌధరి, సుభద్రాదేవిగారి దంపతుల రెండవ సంతానం పురుషోత్తమ చౌధరి. వీరు బెంగాల్ రాష్ట్రం నుండి పరలాకిమిడి ప్రాంతానికి తరలి వచ్చి స్థిరపడిన బెంగాల్ బ్రాహ్మణ కుటుంబానికి చెందినవారు. 1803 సం॥ సెప్టెంబరు 5వ తేదీ గంజాం జిల్లా పరలాకిమిడి తాలుకా మదనాపుర గ్రామంలో రెవరెండ్ చౌధరిగారు జన్మించారు. భరద్వాజ గోత్రం గౌడ బ్రాహ్మణ శాఖ ఆచారం ప్రకారం ఏడవ యేట ఉపనయము జరిపి యజ్ఞోప వీతధారుని చేసి గాయత్రీ మంత్రోపదేశమును గావించారు. తన తండ్రివలె గొప్ప పండితులు కావాలనే ఉద్దేశముతో చిన్ననాటి నుండి హిందూ మత గ్రంథాలు బహు నిష్ఠతో పఠించారు. సంస్కృతం, తెలుగు భాషా పరిజ్ఞానాన్నే గాక వైష్ణవ మత నిష్ఠ గలిగి పెరిగాడు పురుషోత్తమచౌధరి.

1823 లో కులాచారం ప్రకారం మేనమామ రఘునాథ పాల్ మహాంతి గారి కుమార్తె అయిన రాధామణి దేవిని వివాహము చేసుకున్నారు. యవ్వన ప్రాయంలోనే ఈ కవి అనేక హిందూ మత పద్య, కావ్య ప్రబంధాలను రచించారు. అనేక హిందూ మత గ్రంథాలను ఆకళింపు చేసుకొన్నాడు. హిందూ మత గ్రంథాలు చదవడం, వ్రాయడం మరి ఉపాసన చేయుట వలన హిందూ మత నిష్ఠా గరిష్ఠుడైనాడు. ఈ పరిస్థితులలో 1832లో మొట్టమొదటిగా క్రైస్తవ మతముపై జిజ్ఞాస కలిగింది. అది అన్వేషణకు దారితీసింది. దాని ఫలితమే నాటి ముద్రణ పొందిన క్రైస్తవ కరపత్రములు సంపాదించుకొని వాటిని చదవడం ప్రారంభించాడు. క్రమముగా ఈ బ్రాహ్మణ కవి క్రైస్తవ మతంపై విశ్వాసము నిలిపి 1833, జూన్ 10వ తేదీన 30సం॥ల యవ్వనప్రాయంలో యజ్ఞోపవీతాన్ని విసర్జించాడు. అప్పటివరకు బ్రహ్మజ్ఞాన ప్రభావం వలన సన్యాసత్వం స్వీకరించాలని తాను తీసుకొన్న నిర్ణయాన్ని విరమించుకున్నాడు. పిదప అన్న, తల్లి, భార్య మరియు ఇతర బంధు వర్గమునుండి వచ్చిన అవరోధములను ఎదుర్కొని 1833, అక్టోబరు 6వ తేదీన కటక్‌లో

బాప్తిస్మము పొందడం ద్వారా క్రైస్తవ మతాన్ని స్వీకరించారు. ఈవిధంగా ప్రారంభమైన రెవరెండ్ పురుషోత్తమ చౌధరి గారి యొక్క విశ్వాసయాత్ర 1890, ఆగస్టు 26వ తేదీ అర్ధరాత్రి ఒంటిగంటకు ముగిసింది.

## క్రైస్తవ స్వీకరణ - సాంఘిక సంఘటన :

అది 19వ శతాబ్దము మొదటి భాగము. అనేకమంది ప్రొటెస్టెంటు మిషనరీలు భారతదేశము నలుమూలలా క్రైస్తవ మత ప్రచారములో చురుకుగా పనిచేస్తున్న కాలము. క్రైస్తవ మిషనెరీలు మిషనెరీ ఉద్యమంలో ఒక గొప్ప మార్పును ఎదుర్కొనకాలమది. భారతదేశ మంతట ముఖ్యంగా దక్షిణభారత దేశంలోను మరి ముఖ్యంగా ఆంధ్రదేశములోను క్రైస్తవ మత స్వీకరణ గుంపులుగా జరిగిన కాలము. ఈ కాలములో దళితులలో నుండి, శూద్రులలోనుండి మరియు కొండజాతులలోనుండి అనేకమంది సమూహాలుగా వచ్చి క్రైస్తవ మతాన్ని స్వీకరించడం ప్రారంభమైంది.

ఈ కాలంలో క్రైస్తవులు అనగా దళితులు నిమ్నజాతులవారు, పంచములు అని, క్రీస్తు-దళితుల దేవుడని; దళితులు తిండి, బట్ట కోసం మాత్రమే ఈ మతాన్ని స్వీకరిస్తున్నారని, కష్టపడి పనిచేయలేని దళితులు క్రైస్తవ మతంలోకి వలస పోతున్నారని దళితేతరులు అభ్యంతరపడిన పరిస్థితులు ఆనాడు కోకొల్లలుగా వున్నాయి.

ఇక వారి సాంఘిక పరిస్థితి చూచిన వీరు కులహీనులనియు, అంటరానివారనియు, అసహ్యులనియు ప్రజలు బహిరంగంగా ఒప్పుకొనేవారు. వీరు చచ్చిన జంతుమాంస భక్షకులనియు, అసహ్యమైనవిగా ఎంచబడు జంతువులను పట్టి తినువారనియు, అశుభ్రమైన అలవాట్లుగలవారనియు, వీరిని గూర్చి భావించేవారు. గ్రామమునకు వెలుపల దూరంగా వీరు నివసించుచున్నకాలము. చాలా ప్రాంతాలలో బ్రాహ్మణులు, భూస్వాములు నడచిన రహదారులు ఉపయోగించుటకు నిషేధింపబడినవారు. బజారులో యితర కులస్థులు కొనబడి ముగించు వరకు వీరు దూరంగా వేచియుండవలెను. తాము కొనవలసిన వస్తువును తాకుటకుగాని, వరిశ పరీక్షించుటకు గాని వీలులేదు. వీరు తాకిన వస్తువులు వేరొకరు ముట్టరు. కులస్థులు వాడుకొను ఏ బావినుండియు వీరు నీళ్ళు తీసుకొని పోకూడదు. దగ్గరలో వంద గజాల దూరంలో శుభ్రమైన నీరుండినను అనేక సమాయాలలో మైళ్ళదూరము నడిచి చివరికి అశుభ్రమైన నీళ్ళ తెచ్చుకోవాలి. ఇక క్రైస్తవ దళితుల పరిస్థితి మరీ నికృష్టము. అటు ఒకవైపు అగ్రకులాల వారిచే అణగద్రొక్కబడిన దళితులుగాను, మరోవైపు క్రైస్తవ మతాన్ని స్వీకరించినందుకు తోటి దళితులచే వెలివేయబడి, భయంకర పరిస్థితులలో జీవించేవారు.

క్రైస్తవ మతాన్ని స్వీకరించడం దళితులకే జీవన్మరణ సవాలుగా మారిన పరిస్థితులలో రెవరెండ్ పురుషోత్తమ చౌధరి క్రైస్తవ మతాన్ని స్వీకరించడం అందునా దీనిని బహిరంగంగా ఆనాడు బ్రాహ్మణులలో ఉన్నతుడుగా భావించబడిన ఈయన క్రైస్తవునిగా ఒప్పుకోవడం గొప్ప కార్యంగానే భావించాలి.

క్రీస్తుని అంగీకరించడం అంటే ఒక బ్రాహ్మణునికి ఆ కాలములో మత మార్పిడితో మాత్రమే ముడిపడిన సమస్య కాదు. ఆనాటి సాంఘిక పరిస్థితులలో క్రైస్తవ మత స్వీకరణ ఒక సవాలుతో కూడిన సాంఘిక సంఘటన.

ఆయన స్వంత మాటల్లో చెప్పాలంటే " ఓ జనులారా ! క్రైస్తవులు జాతికి చెడిపోయినారని మీరు నిందింతురు." క్రైస్తవ మత స్వీకరణ అనగా ఒక బ్రాహ్మణుడు కుల మాలిన్యము జరిగించుటగా భావించారు. ఎందుకంటే ఇప్పుడే బ్రాహ్మణ క్రైస్తవుడు అంటరాని వారితో కలిసి కూర్చొని క్రీస్తుని ఆరాధించాలి. వారితో పాటు ఒకేమత సంబంధమైన ఆచార వ్యవహారాలలో పాలు పంచుకోవాలి. ఒకే రొట్టె, ద్రాక్షారసములో పాలి భాగస్థుడు కావాలి. వారు వండినవే తినాలి, అవసరమైతే వారితో నుండాలి. అందులోను అభిషేకించబడి సేవకు సమర్పించుకున్న వ్యక్తికి మరీ కష్టం. మత స్వీకరణతో పాటు మత ప్రచారం కొరకు పూర్తిగా ఆనాటి క్రైస్తవులలో ఒకడిగా జీవించవలసిన ఆగత్యం ఎంతైనా వుంది. ఈవిధంగా రెవరెండ్ పురుషోత్తమ చౌధరి క్రైస్తవ మత స్వీకరణ, మత ప్రచార బాధ్యత స్వీకరించడం ఒక మత మార్పిడితో ముడిపడిన కార్యంగా చూసినట్లైతే ఆయనలోని ఆనాటి కులవ్యవస్థకు ఎదురు తిరిగి సమాజంలో ఒక పెద్ద సవాలును ఎదుర్కొన్న ఆదర్శ వ్యక్తిగా మన ముందు నిలుస్తాడు. ఆయనలో సమాజంలోని కుళ్ళు, కుల వ్యవస్థను వ్యతిరేకించి ధైర్యముగా చివరి వరకు జీవించిన ఒక గొప్ప ధీశాలిగా గుర్తించవలసిన అవసరం ఎంతైనా వుంది.

క్రీస్తులో - సామాజిక స్పృహ :

రెవ. పురుషోత్తమ చౌధరిగారు 1832లోనే క్రీస్తుని గూర్చిన అన్వేషణ ప్రారంభించారు. 1833లో బాప్తిస్మం తీసుకొని, క్రైస్తవునిగా మారారు. అదే సంవత్సరము 'కులాచార పరీక్ష' అనే పత్రికను ఈయన ప్రచురించారు.

ఇందులో హిందూమతానికి పునాదిగా చెప్పబడేటటువంటి కులవ్యవస్థను తాను నూతనంగా కనుగొన్న 'క్రీస్తు' అనేటటువంటి అర్థంలో చూడగలిగారు. ఇది ఆయన సమాజాన్ని అర్థంచేసుకోవడంలోనే ఒక నూతన మార్పు తీసుకొని వచ్చింది. కులవ్యవస్థను ఖండించడానికి తన పత్రికలో సృష్టితో ప్రారంభించి క్రీస్తు మరణ పునరుత్థానాలతో ముగిస్తారు. అనగా ఈయన ఉద్దేశం నా దృష్టిలో ఉపోద్ఘాతము ముగింపులో వున్న అంశాలన్నీ కూడా ఈయన క్రైస్తవుడిగానే చూచారు. ఈయన మాటల్లో చెప్పాలంటే

> ఎక్కువ కులము ... తక్కువ కులము ... అని అనేక మర్యాదలు కల్పించుకొని, ఈ దేశస్థులైన మీరందరూ మిక్కిలి జ్ఞానవిరోధంగా ప్రవర్తించుచున్నారు. మరియు మీరు క్రీస్తు మతం చేత కులం చెడిపోవును అంటున్నారు. మంచిది మొదట మీది ఏకులం? ఎందువల్ల పుట్టినారు? ఏ సంబంధులైనారు? విచారించి చూడగా రక్త మాంస సంబంధమైన మీ శరీరములకు కులము లేదాయెను, మీ శరీరములో వున్న జీవమునకు కులము లేదాయెను. అయితే మీ కులములు మరి దేనిని అనుసరించి

నా దృష్టిలో ఈయన ఉద్దేశం ఏమనగా – కులవ్యవస్థ హిందూమతము ఏర్పరచుకొనిన అమర్యాదకరమైన మర్యాద అని ఆయన ఉద్దేశము. ఈయన ఒక వ్యక్తి పుట్టకముందు, చచ్చిన తర్వాత ఏం కులము ? అని ప్రశ్నించుటలో ఆత్మ దేవుని దగ్గరినుండి రాకమునుపు, తిరిగి దేవునితో చేరిన తర్వాత కులరహితమైనదని అంటున్నారు. హిందూమత సిద్ధాంతం ప్రకారం ఆలోచించిన ఆత్మ పరమాత్మలో నున్నపుడు తిరిగి పరమాత్మను చేరినపుడు ఏకులానికి చెందదన్న సంగతిని వారు గుర్తు చేస్తున్నారు.

కులవ్యవస్థ మానవులు సమాజంలో జీవిస్తున్నంత కాలం " ఉదరపోషణ నిమిత్తమైన " వ్యవహార కార్యములను అనుసరించి ఉన్నదే గాని, మరి ఏమీ లేదు. ఈ నానావిధాలైన కులాలు తమ వృత్తులకు అవసరమైన పేర్లు మీరే నిర్ణయించుకున్నారా లేక మీ దేవుళ్ళు నిర్ణయించినారా? అని ప్రశ్నిస్తూ, " మీ శాస్త్రములలో 18 కులములే నిజమై వుంటే ఈనాడు 18వందల కంటే అధికంగా కులములెట్లు ఏర్పడెను? అని అనడంలో ఆయన ఉద్దేశం కులవ్యవస్థ అనేది మానవులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం సృష్టించుకున్న సౌకర్యం మాత్రమే గాని, ఇది ఏ దేవుళ్ళ వలననూ యివ్వబడిన వ్యవస్థ కాదు. అనగా కులవ్యవస్థకు ఏ మత సంబంధమైన పవిత్రత లేదు అని ఋజువు చేస్తున్నారు. ఈయన ఇంకొక మెట్టు పైకి వెళ్ళి –

> ఓ జనులారా ఒక్క మాలవాని ముట్టుకొన్నంత మాత్రం చేత స్నానం చేయవలెనని మీరెలాగూ చెప్పుదురు? అయ్యో కపటస్థులారా ఏ జాతివాండ్లవైపు చూచి మీగురువులు ముట్టకూడదు అనుకుంటా వో వాళ్ళని తరుముదురో ఆటువంటి మాలవాండ్లకునూ, మీ గురువులైన వారికిని ఏకత్వముగా జరిగే రహస్యకార్యములను నేను మీకు తెలియ చెప్పెదను వినండి వైష్ణవులు, మాలవాండ్లకు వైష్ణవము ఇచ్చునపుడు ముందుగా వాండ్లను ముట్టుకొని చెవిలో మంత్రము చెప్పి వాండ్ల భుజముల మీద ముద్రలనువేసి తర్వాత వాండ్లతో గూడి శేష శేష సంబంధమైన ఏకపాత్రలో కలిపి తినవలెను. ఆ తర్వాత మాలవాండ్ల స్త్రీలను సహా దాసురాండ్లనుగా చేసికొని వారితో కొన్ని చెడ్డ కార్యములు జరిగింతురు. అట్టి సమయములో గురువులు జరిగించు బహు దుష్టమైన అసహ్య కార్యములు వ్రాయగూడదు. వ్రాసినట్లయితే ఈ పుస్తకము అపవిత్రమౌను. ఆమిదున కైంకర్యమను చెడ్డకార్యమును గురించి మీలో కొందరు అనుభవశాలురు ఎరిగియుందురు గనుక వాటిని తెలుసుకోవచ్చును.

ఈయన సమాజంలో బాహ్యంగా ఏర్పరచుకొన్న కులవ్యవస్థ అనే సౌకర్యం అగ్రకులాలవారి యొక్క వ్యక్తిగత శారీరక సౌకర్యం విషయానికొచ్చేటప్పటికి కులవ్యవస్థ యొక్క ప్రాముఖ్యతను పాటించకపోవడం ఈయన ప్రశ్నిస్తున్నారు. కులవ్యవస్థ నిజంగా మత పవిత్రత కలిగినదే అయితే శారీరక సుఖం దగ్గరికి వచ్చినపుడు కూడా దీన్ని పాటిస్తారు. కాని అలా జరగడం లేదు. ఎందుకంటే కులవ్యవస్థ అనేది సామాజిక సౌకర్యమే తప్ప అంతకు మించి ఏ పవిత్రతా దీనిలో లేదు అని ఆయన ఋజువు చేస్తున్నారు. దీనిని ప్రశ్నిస్తూ

> మొదట ఈ నాలుగు కులములను కలుగజేసిన బ్రహ్మ యేమి కులమువాడు? అతడు దేవుడైనందువల్ల కులము లేదంటిరా అతనికి లేని కులము మీకు ఎక్కడినుంచి వచ్చెను? బ్రహ్మ ఒక్క కులముగల వాడైతే ఆయనకు పుట్టిన నలుగురు కొడుకులు నాలుగు కులములు ఏలాగు అవుతారు? ఇందుకు దృష్టాంతముగా ఒక పనసచెట్టుకు మొదటినుంచి చివరి పర్యంతము నాలుగు కాయలు కాసినట్లయితే నాలుగును పనసకాయలే అందురా? లేక

కుల వ్యవస్థ మత ప్రమాణాలకు మరియు సామాజిక ప్రమాణాలకు మాత్రమే గాకుండా వేదువాద ప్రమాణాలకు కూడా సరిపోదు అని ఆయన ఉద్దేశం. కుల వ్యవస్థ సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఒక జాడ్యము అని, ఇది కొందరు స్వార్థపరులు ఏర్పాటు చేసుకొన్న సౌకర్యము అని ఈయన ఉద్దేశము.

మనకు పైన చెప్పబడిన పై విషయాలు రెవ. పురుషోత్తమ చౌధరిగారి యొక్క సామాజిక స్పృహకు గొప్ప నిదర్శనాలు. ఈయన ఉద్దేశములో సమాజంలోని వ్యక్తులందరూ సమానులని, ఏ వాదము యొక్క ప్రమాణాలకు సరిపోని కులవ్యవస్థ మానవ క్రియ అని ఈ కులవ్యవస్థ సమూలంగా అంతరించిపోతేనే గాని మానవ జాతికి విమోచన ఉండదని ఈయన ఉద్దేశము. సమ సమాజ స్థాపనకు మానవ జాతి విమోచనకు క్రీస్తులోని మార్గముందని ఈయన ఉద్దేశము.

<u>క్రైస్తవ సాహిత్యము – సామాజిక చైతన్యము :</u>

రెవ. పురుషోత్తమ చౌధరి తాను కనుగొన్న నూతన సామాజిక స్పృహను గూర్చి సమాజంలోని అగ్రవర్ణాలకు తెలియజేయడమే గాకుండా అణగద్రొక్కబడి, అణగారిన క్రైస్తవ విశ్వాసులను మేల్కొలిపడానికి కూడా ప్రయత్నించారు. ఆంధ్రక్రైస్తవ కీర్తనలలో 435వ కీర్తన :

యెహోవా మా తండ్రిగాడ - యేసుడు మా యన్నగాడ =
మహిమగల శుద్ధాత్మ యిట్టి - వరుస దెలిపెం గద మాతోడ ॥యెహోవా॥

ఈ కీర్తనలో పురుషోత్తమ చౌధరిగారు నూతనంగా విశ్వాసంలోనికి వచ్చిన క్రైస్తవులు, వారు దళితులు కానివ్వండి, మరెవరైనా కానివ్వండి, తమకుటుంబాలనుంచి, బంధువుల నుంచి, స్నేహితుల నుంచి అనేకసార్లు తామున్న గ్రామం నుంచి కూడా వెలి వేయబడి క్రీస్తు కొరకు శ్రమపడవలసి వచ్చెను. ఇక దళితులైతే, మరొక్కపు క్రీస్తును స్వీకరించినందువలన తమ స్వంత వారి వలన వెలివేయబడి, కులమునుబట్టి ఒకసారి, మతాన్నిబట్టి మరోసారి సమాజానికి, స్వబంధువులకు దూరమై మానసికంగా కృంగిపోతున్న వేళ యిది. క్రీస్తు నంగీకరించడం వల్ల హిందూమతంలో ఉన్నటువంటి కుల వ్యవస్థ నుండి తప్పించుకొని, దూరంగా వెళ్లాలి అనే ప్రయత్నం చేసిన వారికి మతం వల్ల మరోదెబ్బ తమ స్వంతవారి ద్వారానే తగిలింది. కులం ముఖ్యమా? క్రీస్తు ముఖ్యమా? కులం కట్టుబాట్లు ముఖ్యమా? క్రీస్తు యొక్క సిద్ధాంతాలు ముఖ్యమా? అనే సందిగ్ధావస్థలో వున్న వారికి ఈ కీర్తన ఒక గొప్ప మానసిక స్థైర్యాన్ని కలిగిస్తుంది. యెహోవా తండ్రియని, యేసు అన్న అని, దూతలు స్నేహితులని, పరలోకం పుట్టిల్లు అని, భక్తాగ్రేసరులే చుట్టాలని... ఈవిధంగా క్రీస్తులో విశ్వాసులు కనుగొన్న నూతన బంధువులను, బంధుత్వాలను పరిచయం చేస్తూ వారియొక్క మానసిక స్థితిని, ఆత్మీయస్థితిని బలపరచడం జరిగింది.

ఆంధ్రక్రైస్తవ కీర్తనలలో 174వ కీర్తన :

యేసువంటి ప్రియ బంధుడు నాకిక - నిహ పరములలో లేడన్న -
భాసురముగ నిజ భక్తుల కది యను - భవ గోచర మెపు డగు నన్న ॥యేసు॥

నిజమైన సమాజాన్ని విశ్వాసి కనుగొన్నాడు అనే చైతన్యాన్ని తీసుకురావడానికి ప్రయత్నం చేసారు. ఊరు, వేరు, పరువు పోయినా, తిరస్కారాలు, అవమానాలు ఎన్ని ఉన్నా, తగ్గుపాటులు, సిగ్గుపాటులు ఎదురైనా, శోధింపబడినా, చివరికి తల్లిదండ్రులు విడిచినా ఇవన్నీ కూడా క్రీస్తులో విశ్వాసికి సమాజంలో ఓటమి కాదని, నిజానికది విజయమని క్రైస్తవ విశ్వాసులకు నూతన చైతన్యాన్ని, మానసిక స్థైర్యాన్ని, ఆత్మీయబలాన్ని చేకూర్చాడు.

పై రెండు కీర్తనలు ప్రస్తుతానికి ఉదహరణలుగా మాత్రమే చెప్పబడ్డాయి. అసలు ఈయన కీర్తనలు చాలావాటిలో నూతన విశ్వాసులు, తాము సమాజంలో మానసిక స్థైర్యాన్ని పోగొట్టుకొని బ్రతుకుతున్న వేళ వారికి నూతన సామాజిక చైతన్యాన్నివ్వడంలో ఎంతో సహాయపడ్డాయి. ఇలా ఈయన కీర్తనలన్నీ విశ్లేషించుకొంటూ పోతే, నాయీ వ్యాసానికివ్వబడిన సమయం మించిపోతుంది.

అందుకే ఇక ఈ మూడు మాటలతో ముగిస్తాను. రెవ. పురుషోత్తమ చౌధరిగారు సమాజ సౌకర్యార్థం ఉన్నటువంటి కులవ్యవస్థకు ఎదురు నిలిచి క్రైస్తవత్వాన్ని స్వీకరించారు. తాను నమ్మిన నవ సమసమాజ నిర్మాణం కొరకు అగ్రవర్ణాలలో సామాజిక స్పృహను కలిగించ ప్రయత్నించారు. వీటితోపాటు " ముందు నుయ్యి, వెనుక గొయ్యి " అన్న పరిస్థితుల్లో వున్న నూతన క్రైస్తవ (దళిత) విశ్వాసులలో మానసిక స్థితిని బలపరచడానికి నిజసమాజాన్ని చైతన్యపరచడం కొరకు ఎంతో కృషి చేసారు. రెవ. పురుషోత్తమ చౌధరి సమాజిక దృక్పథంలో చూడడానికి నేను చేసిన ఈ చిన్న ప్రయత్నం ఇంతటితో ఆగిపోకుండా దీనిపై పూర్తికాలపు పరిశోధన జరగాలని దళిత క్రైస్తవుల జీవితంలో ఈయన చేసిన కృషి ఫలితాలు నిజం కావాలని ఆకాంక్షిస్తూ...

వ్యాసకర్త -
రెవ. తాతపూడి మాథ్యూ ఇమ్మానుయేలు,
ప్రొఫెసరు, ఎసిటిసి.